
Regd. No. H/NL 18

విడి ప్రతి 50 పైసలు

శుక్రవారం 4-8-1978


DON'T USE YOUR BRAIN USE OURS!
omron
Available at
Rs.190/-
A.B. TELEVISION NELLORE.

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 49 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ఎం. ఎల్. సి. సంచిక 31


పూర్ణా డిపార్ట్‌మెంటల్ స్టోర్సు

# వాకాడు జ్యోతి ఆరిపోయింది!



వాకాడు జ్యోతి ఆరిపోయింది!

నలభైమూడేళ్ళ నిరంతర దీక్షతో సేవతో అలసి సొలసి స్వస్థతను కోల్పోయిన ఒక సంపూర్ణ మానవతావాది హృదయం సంతృప్తితో స్పందనరహితమైపోయింది.

అస్పృశ్యులు, అనాథలు అనేవారి శ్రేయస్సుకోసం అనుక్షణం శ్రమించిన, స్పందించిన ఒక వ్యక్తి పంచభూతాలలో కలిసిపోయాడు.

పద్మశ్రీ నెదురుమల్లి బాలకృష్ణారెడ్డి శాశ్వతంగా కన్నుమూశారు.

ఆయన ధన్వంతరి, కర్మయోగి. దీనజన సేవతో పునీతమైంది ఆయన జీవితం. ఆర్తులకై అంకితమైంది ఆయన జీవితం. బాలకృష్ణారెడ్డి వంటి మహనీయులు, కారణ జన్ములు, ధన్వంతరులు ఈ దేశంలో చాలా మంది కనపడరు.

గుండెనొప్పితో చికిత్సకై 1 వ తేది నెల్లూరు మోహన్ హాస్పిటల్‌లో చేరిన శ్రీ బాలకృష్ణారెడ్డి, తీవ్రమైన రెండుగుండె పోట్లకు గురియై, తన సహజ స్నేహ సౌజన్య సౌహార్ద్ర భావంతో మృత్యువును కూడా మచ్చిక చేసుకోడానికి ప్రయత్నించి, చివరవరదానితో సంకులసమరం జరిపి ఓడిపోయి 3 తేది ఉదయం 8 గంటలకు ఇహలోకాన్ని వీడిపోయారు. జీవితంలో విశ్రాంతి విరామం ఎరుగని బాలకృష్ణారెడ్డి శాశ్వత విశ్రాంతిని పొందాడు!

బాలకృష్ణారెడ్డిగారు మార్చిలో మంత్రిగా

—కొరవ 7 వ పేజీలో

## కిరణ్ అండ్ కంపెని

ఫోన్ : 1768

10/142, సంతపేట - నెల్లూరు

వారిని మా

**Janathacem**

డెకొరేటివ్ వాటర్ ప్రూఫ్ సిమెంటు పెయింట్సుకు

ఆంధ్రప్రదేశ్ సోల్ డిస్ట్రిబ్యూటర్స్‌గా నియమించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

## లైన్‌నాఫ్ కెమికల్స్

రాజపాళయం, తమిళనాడు.

—జనతాసెం పెయింట్సు విశిష్టతలు—

సిమెంటు పెయింట్సులో కెల్ల మేలైనది. తక్కువధర, చిరకాలమన్నిక, కాల్సైట్ బేస్‌తో ఎక్కువ స్థలాన్ని పెయింట్ చేసే ఇండియాలోని మొట్టమొదటిది.



—M/s. శ్రీ వెంకటేశ్వర హార్డువేర్ & పెయింట్సు కంపెని, సంతపేట, నెల్లూరు వారి శుభాకాంక్షలతో.



వెలిగినజ్యోతి: 29 లేది వాకాడు సంస్థల జ్యోతి దినోత్సవంలో మంత్రులు జ్యోతిని వెలిగించి దమురు పోస్తుంటే తృప్తిగా చూస్తున్న బాలకృష్ణారెడ్డి. మంత్రులు - వడ్డె నాగేశ్వరరావు, శ్రీ పి. ఆర్. ఎస్. పద్మనాభరాజు, కోనేరు రంగారావు, వేదాంతరావు, శాసనసభ్యుడు నల్లా పట్టాభిరావు.

# దీనజన సేవలో తరించిన తపస్వి-
# మానవత మూర్తీభవించిన మహామనస్వి
# శ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి

బాలకృష్ణారెడ్డి ఇక లేరు.

చల్లనైన స్వచ్ఛమైన ఆదియనవ్వు, అర్ద్రమైన అంతఃపూరితమైన ఆ పలకరింపు, అరమరలులేని ఆప్యాయత ఆత్మీయతలతో నిండిన ఆ కరచాలనం ఇక లేవు. నలభయ్యేళ్ళ నిరంతర నిర్విరామ నిరుపమాన సేవాయాత్రను మనకు మిగిల్చి, నిశ్శబ్దంగా నిర్మలంగా వెళ్ళిపోయాడు. మహానుభావుడు.

వేలాది అనాథబాలుర హృదయరోదన సముద్రఘోషగా వాకాడును ముంచెత్తుతూంది. ఆ దిన్నారిగుండెల్లో వెల్గిన జ్యోతిని నిర్దాక్షిణ్యంగా ఆర్పేసింది మృత్యుదేవత! ఒక వ్యక్తి మరణిస్తే ఇన్ని వేల కళ్ళు అశ్రుపూరితాలయ్యాయంటే, ఇన్ని వేల హృదయాలు గోడుగోడున ఆక్రోశించాయంటే ఆయన వ్యక్తికాదు, ఒక అపూర్వ శక్తి. అన్ని వేలమంది మనస్సులలో మందిరం నిర్మించుకోగల్గిన ఆ వ్యక్తి ధన్యజీవి.

పసిపిల్లవాడు ఆకలేసి ఏడ్చినా ఏదైనా తేకపోతే ఆయనగుండె కలుక్కుమనేది. రోడ్డు ప్రక్క, చీకి చివర, దిక్కులేని బాలురుపూటలో ఒక పసికందు చేయిచాపితే ఆయనలోని మాతృహృదయం ఆక్రోశించేది. చింపిరితలలతో మాసిన పేలికలతో ఎముకల గూళ్లవలె వున్న అనాథలనుచూస్తే ఆయనగుండె కన్నీరు కార్చేది.

ఆ మానవత్వమే, ఆ జాలిహృదయమే 1935 లో వాకాడు సంస్థలకు పునాది రాయి అయింది. హరిజనులప్పటికింకా 'మాల మాదిగలు' గానే, అంటరానివారు గానే పరిగణింపబడుతుండేవారు. ఆ 'కరడు గట్టిన' కంటితో చూడ్డమే పాతకంగా భావించిన గాఢమూఢాంధకార కాలమది. ఆ రోజుల్లో ఒక హరిజనుడి విద్యార్థి శిక్షణకు బాలకృష్ణారెడ్డి ఒక రాత్రి పాఠశాల ప్రారంభించాడంటే - అదీ హరిజనవాడలోనే ఏర్పాటు చేశాడంటే- ఆయనను ఏ శక్తి ఏ సేవానురక్తి ఆవహించిందో ఈ రోజు ఊహించలేము.

మరి మూడేళ్ళకు ఒక హాస్టలు ఏర్పడింది. అదీ బాలకృష్ణారెడ్డిగారి మానవతా హృదయానికి చిహ్నమే. పొరుగూరునుంచి తనవద్దకి పిల్లకాయల్ని తీసుకొస్తుంటే, వారిలో ఒకడు ఆకలిశోషతో నడవలేకపోయాడట. వాడికోసం హాస్టలు పెట్టాలనే తలంపు బాలకృష్ణారెడ్డిగారికి కల్గిందట. అదే ఈనాటి వాకాడు సంస్థలనే మహావృక్షానికి తొలిబీజం. అప్పట్నుంచీ ఆచిన్న మొక్కను కాపాడి పోషించి పెద్దదెయ్యడానికి ఆయనెన్ని బాధలనుభవించాడో, ఎన్ని ధిక్కారాలు సత్కారాలు పొందుతూ, అన్నిటినీ సమంగా స్వీకరిస్తూ తన నిరంతర సేవాయాత్రను నిరాటంకంగా కొనసాగించాడో- ఆయనకే తెలుసు. సంస్థ నిర్వహణలో తగిలిన ఎదురుదెబ్బలతో ఆయన నుదురు గాయలు కాచినా, పెదవులపై చిరునవ్వు చెరగలేదు. ప్రశంసలను విమర్శలను ఆయన సమంగా స్వీకరించాడు. ఒక దానికి పొంగలేదు, ఇంకొకదానికి క్రుంగలేదు. తన గమ్యం ఏదో తెలిసిన నిత్య

> నీరాజనం

పథికుడు గనుక, వెనుక చూపన్నది లేకుండా, దేనికీ వెరవకుండా సాగిపోయాడు. చుట్టూ ఆవరించిన చీకట్లను తిట్టుకొంటూ కూచోవడం ఆయనెరుగడు; ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడమే ఆయన లక్ష్యం. ఐతే అనాడు ఆయన వెలిగించిన చిన్న దీపం ఈనాడింత మహోజ్జ్వల జ్యోతిగా వెలుగొందగలదని ఊహించి వుండకపోవచ్చు. చిత్తశుద్ధి, సేవాదీక్షవుంటే సాధించరానిది లేదని ఆయన జీవితం నిరూపించింది.

మొదటి పదిసంవత్సరాలు ఆ సంస్థ కెన్నో బాలారిష్టాలు కల్గాయి. 'మాలమాదిగల'ను చేరదీయడమే ఒక 'అరిష్టం'; పైగా డబ్బుకొరత. పిల్లకాయల్ని ఒక్కపూటకూడా పస్తుపడకోబెట్టరాదనే పట్టుదల. ఎన్ని కష్టాలు ఎదురైవుంటాయో ఊహించుకోవచ్చు. ఐనా ఆయన పట్టు సడలలేదు; పైగా మరింత దృఢ సంకల్పం ఆయన్ను ముందుకు నడిపింది. క్రమ క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. 'ఇది నడుస్తుందా, నిలుస్తుందా'? అనే అనుమానాలు క్రమేణా తీరిపోయాయి. చదువుకోవాలన్న కోరిక కల్గిన హరిజన బాలురకు, నా అన్నవారులేని అనాథబాలురకు వాకాడు ఒక ఆశాక్షేత్రం అయింది. దీనులు, హీనులకు వాకాడు ఒక ఆదర్శ మార్గంగా కనపడింది. ఇక ఆ మార్గానికి పరిసర ప్రాంతాలనుంచే కాక దూరాబారాల నుంచి కూడా రావడం మొదలయింది. మరికొంతకాలానికి ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా మారడం వాకాడు సంస్థల చరిత్రలో ఒక ప్రధానఘట్టం. తొలుత నుంచీ ఈ సంస్థకు చేదోడు వాదోడుగా వున్న మిషనరీలకు హైస్కూలు స్థాపన పట్ల ఏవో అనుమానాలు కల్గినా, బాలకృష్ణారెడ్డి వెనుకంజ వెయ్యలేదు. 1951లో హైస్కూలు స్థాపించి ఆ సంస్థల భవిష్యత్తుకు బంగారు బాట వెయ్యడం మొదలు పెట్టారు.

తర్వాత ఒక్కొక్కటీ వెలిశాయి. సంస్థ శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. సరిగ్గా మాటలైనా రాని పసిబిడ్డ మొదలు, కాటికి కాలు చాపిన నందుమునలిదాకా ఆ మహావృక్షం నీడన సేవదీక్షకొనగల్గుతున్నారు. నర్సరీ స్కూలు, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఉపాధ్యాయ శిక్షణాలయాలు -ఎన్ని విద్యాసంస్థలకు అది నెలవు అయిందో చెప్పలేము. కడకు ఆయన పేరటనే ఒక కాలేజి, ఆయన నిత్యం ఆరాధించే భీమేశ్వరుని పేర ఒక సంస్కృత కళాశాలలతో 'విద్యానగరం' ఏర్పడింది. అది బాలకృష్ణారెడ్డి కలల పంట, కృషి ఫలితం.

జనార్దనరెడ్డి చేతికి అందివచ్చినతర్వాత ఆ సంస్థలకొక స్థిరత్వం ఏర్పడింది. వారు పట్టిందంతా బంగారమే. కొండలు గుట్టు పెట్టికూడా సాగుచేస్తే బంగారంపండింది. అది బాలకృష్ణారెడ్డి అదృష్టం. తనను ఆశ్రయించిన అనాథులను ఆయన నిరాకరించి ఎరుగడాయన. ఎక్కడెక్కడనుండో

—కావల 7 వ పేజీలో

## కర్మతపస్వి

అడుగడుగున యెదురయ్యేడు
చిడిముడులకునోర్చి సంఘసేవార్థమ్మై
ఒడలొడ్డిన మొనగాడవు
కడుధన్యము నీదుజన్మ కర్మతపస్వి.

-మల్లెమాల

●

అంతరించిపోయె హరిజనోద్ధరణమ్ము
సన్నగిల్లిపోయె సంఘసేవ,
బాపుమార్గగామి బాలకృష్ణారెడ్డి
కర్మయోగి త్యాగి కన్నుమూసె!

-శివారెడ్డి



ఆరినజ్యోతి: 3 వ తేది ఉదయం శాశ్వతనిద్రలో విశ్రాంతి తీసుకున్న బాలకృష్ణారెడ్డి. ఆయన భౌతిక కాయాన్ని వెల్లూరు పురవీధుల్లో తీసుకవెడుతున్న దృశ్యం

